# నవతరం
తెలంగాణ రౌండప్
గురువారం, డిసెంబరు 22, 2022 పేజీలు:6



2లో

## ఆదివాసులకో న్యాయం, కవితకో న్యాయమా?

- బిసి రిజర్వేషన్ల కోసం మోడిని నిలదీయాలి
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాజీనామా చేయాలి
- సెక్రటేరియట్ బదులు టాయిలెట్స్ నిర్మించండి

డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. రాష్ట్ర అధ్యక్షులు బహుజన్ సమాజ్ పార్టీ



6లో

## తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావును వెంటనే సస్పెండ్ చేయాలి: విహెచ్పి


4లో

## తల్లి బిడ్డల ఆరోగ్యం కోసమే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు**

తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకె కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ను అందుబాటులోకి తేవడం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్ నుంచి వర్చువల్ మోడ్ లో రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా జరగిన ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్ పాల్గొన్నారు.

## తెలంగాణలో ఓట్లు అడిగే హక్కు టీడీపీకే ఉంది: చంద్రబాబు

ఏపీని మళ్లీ తెలంగాణలో కలిపేస్తామంటూ చేతగాని వ్యక్తులు మాట్లాడుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. మళ్లీ ఏపీని కలిపే ప్రస్తక్తే లేదని తేల్చి చెప్పారు. తొమ్మిదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశానని.. 10 ఏళ్లు అపోజిషన్ లీడర్ గా ఉన్నానని బాబు అన్నారు. 40 ఏళ్లు ఏ ప్రజలైతే తనను ఆశీర్వదించారో వారి కోసం జీవితాంతం పనిచేస్తానని చెప్పారు. టీడీపీ వేసిన ఫౌండేషన్ వల్ల పెద్ద రాష్ట్రాలను కలుపుకుని... తెలంగాణ ఎక్కువ ఆదాయాన్ని రాబడుతోందని బాబు అన్నారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసి.. రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలన్న ఆశ ఉందన్నారు.అలాగే... ఏపీలో గాడి తప్పిన పాలనను ఆదుకో వాలని చంద్రబాబు చెప్పారు. తెలుగురాష్ట్రాలు విడిపోయినా.. కలిసి పనిచేస్తే దేశానికే ఆదర్శం అవుతాయని ఆయన స్పష్టం చేశారు.







## అధికారపార్టీలో ప్రోటోకాల్ వివాదం

3లో

# ఆదివాసులకో న్యాయం, కవితకో న్యాయమా?

**బిసి రిజర్వేషన్ల కోసం మోడిని నిలదీయాలి**
**ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాజీనామా చేయాలి**
**సెక్రటేరియట్ బదులు టాయిలెట్స్ నిర్మించండి**
**డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్..రాష్ట్ర అధ్యక్షులు బహుజన్ సమాజ్ పార్టీ**







పెద్దపల్లి, డిసెంబర్ 21 (నవతరం): వందకోట్ల పేదల డబ్బు దోచుకొని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి పంపి లిక్కర్ స్కాం చేసిన ఎమ్మెల్సీ కవితకు ఒక న్యాయం,తిండి కోసం ఇరవై ఏళ్లుగా పోడు చేసుకున్న ఆదివాసులకు ఇంకో న్యాయమా అని డా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. పోలీసులు విచారణ జరిపి చార్జిషీట్ లో పేరున్నా కూడా కవిత భంగుళాల్లో ఉంటే,ఆదివాసులు మాత్రం తిండికోసం పోడు చేసుకున్నందుకు అన్యాయంగా హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారని,ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు.అసెంబ్లీ సాక్షిగా పోడు భూమికి పట్టాలిసామని హామి ఇచ్చి,సర్వేల పేరుతో డ్రామా చేసి ఆఖరికి పట్టాలివ్వకుండా జైలుకు పంపారని ఆయన మండిపడ్డారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా 149వ రోజు పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం లక్షల ఎకరాల అసైన్డ్ భూమి కబ్జా చేసిందని,కేవలం రెండు వందల గజాల జాగ ఇచ్చి నాలుగు ఎకరాల భూమి లాక్కుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంగ్రామ యాత్ర చేస్తున్న సంజయ్,బిసి బిడ్డ అయ్యుండి బిసి రిజర్వేషన్ల కోసం ఎందుకు మోడిని నిలదీయడం లేదని నిలదీశారు. దమ్ముంటే బిసి కులగణన చేసి,రిజర్వేషన్లు పెంచాలని మోడిని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా తమిళనాడు, జార?ండ్, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల వలే ఎస్సీ ఎస్టి బిసి మైనారిటీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉన్నా బిసిలకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. పోలీస్ నియామకాల్లో లాంగ్ జంప్ 3.8 మీటర్ల నుండి నాలుగు మీటర్లకు పెంచడం వల్ల వేలాది మంది అభ్యర్థులు నష్టపోతున్నారని,ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా, గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఈవెంట్స్ నిర్వహించడం వల్ల విద్యార్థులు చనిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం లాంగ్ జంప్ 3.8 మీటర్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని జిల్లా కేంద్రంలోనే కరెంట్ లేని గుడిసెలు ఉన్నాయని,కనీసం కరెంట్ సౌకర్యం కల్పించలేని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చాలా మంది పేదలకు ఇళ్లు లేక చీరలు కట్టుకొని నివసిస్తున్నారని,ప్రభుత్వం పెద్దపల్లి కుందారం దగ్గర రైల్వే ట్రాక్ మీద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. వాళ్ల ఫాంహౌస్ లకు అద్దం లాంటి రోడ్లు వేసుకొని, మనకు మాత్రం కనీసం సరైన రవాణా సౌకర్యాలు కల్పించడంలేదని పేర్కొన్నారు. కూనారం గ్రామంలో యాభై ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేదల భూమికి ఇప్పటివరకు పట్టాలివ్వలేదని,గ్రామస్థులు వ్యవసాయం చేస్తే రైతుబంధు దోపిడి వర్గాలకు పోతున్నాయని, ప్రభుత్వం వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.బహుజన రాజ్యంలో పేదల భూములన్నిటికీ పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు,నాలుగు వందల మంది విద్యార్థులున్న చోట ఒకే టాయిలెట్ ఉండడం ఏంటన్నారు. 2వేల కోట్లతో సెక్రటేరియట్,ఏడువందల కోట్లతో కంట్రోల్ సెంటర్ నిర్మించే బదులు టాయిలెట్స్ నిర్మించి విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందించవచ్చని సూచించారు.ఈ బాధలన్ని పోవాలంటే బహుజన రాజ్యం రావాలని,అందుకు ఏనుగు గుర్తుకే ఓటేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి హనుమయ్య, అసెంబ్లీ ఇంచార్జి దాసరి ఉష,జిల్లా ఇంచార్జి శేఖర్,జిల్లా అధ్యక్షులు దుర్గయ్య,జిల్లా మహిళా కన్వీనర్ స్వప్న గౌడ్,శారద,సుమతి తదితరులు పాల్గొన్నారు.

# ఈ-కేవైసీ చేస్తేనే పీఎం కిసాన్ డబ్బులు

## ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలి
## జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్



పెద్దవంగర, డిసెంబర్ 21(నవతరం): పీఎం కిసాన్ పథకం ఆర్థిక సాయం రావాలంటే ప్రతీ రైతు ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భూక్య ఛత్రు నాయక్ అన్నారు. బుధవారం చిన్నవంగర గ్రామంలోని పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే 13వ విడత పీఎం కిసాన్ డబ్బులు పడతాయన్నారు. జిల్లాలో వంద శాతం ఈ-కేవైసీ చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు 89 శాతం పూర్తయిందని తెలిపారు. త్వరలోనే ఈ-కేవైసీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలన్నారు. వెదజల్లు, డ్రం సీడర్ పద్ధతి ద్వారా వరి సాగు చేయడం పట్ల అధిక లాభాలు వస్తాయన్నారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుపై ప్రోత్సహిస్తుందని, రైతులు ఆయిల్ ఫామ్ పై దృష్టి సారించాలన్నారు. గ్రామంలో ఓ రైతు వరి కొయ్యకు నిప్పు పెట్టగా, అతని వద్దకు వెళ్లి తద్వారా సంక్రమించే నష్టాలను వివరించారు. వరి కొయ్యను కాల్చడం ద్వారా భూమిలో ఉండే కోటాను కొలది సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. దీంతో భూసారం పూర్తిగా దెబ్బతిని, పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ మానస, వీఆర్ఏ రవి, రైతులు పాల్గొన్నారు.





## పట్టుబడ్డ దొంగలు

కొత్తగూడెం, డిసెంబర్ 20 (నవతరం): కారు నీ చోరీ చేసి తప్పించుకున్నా దొంగలు ఎట్టకేలకు దొరికారు... అయితే తమను ఎవరు గుర్తుపట్టకుండా ఉండేందుకు స్వామి మాల వేసుకొని తిరుగుతున్నారు. హిందీలో మాట్లాడు తున్నారు. అయితే కారు చోరీ అయిన వార్త సోషల్ మీడియాలో హాలచల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు వెంటనే ఎక్కడికి అక్కడ నిఘా ఏర్పాటు చేసి వాహనాలు తనకు చేపట్టారు. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో పోలీసులు కారును పట్టుకున్నారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు మూడో వ్యక్తి పరారయ్యాడు.



## కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లు పంపిణీ

బూర్గంపాడు, డిసెంబర్ 21(నవతరం): బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. పీహెచ్సీ వైద్యురాలు పి. స్పందన అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పొడియం ముత్యాలమ్మ, స్థానిక సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ చేతుల మీదుగా న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ మోనటరింగ్ ఆఫీ సర్ జీ. నాగభూషణం, తహశీల్దార్ భగవాన్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## బౌరంపేట్ శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21(నవతరం) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ లో బుధవారం రోజున జరిగిన శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ 4వ వార్షికోత్సవ వేడుకల్లో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని సీనియర్ నాయకులు కేఎం ప్రతాప్, చినంగి వెంకటేశం ముదిరాజ్ తో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు స్వయంగా భిక్షను వడ్డించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారపార్టీలో ప్రోటోకాల్ వివాదం

**చిల్కనగర్లో చిచ్చు రేపిన ప్రోటోకాల్ వివాదం.. అధికార ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా మేయర్ విజయలక్ష్మి హాజరు.**

**మేయర్ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపిన భారత రాష్ట్ర సమితి నాయకులు.. కనీసం కార్పొరేటర్ కి తెలియదా ఆహ్వానించాలని అని ప్రజల గుసగుసలు...**

**చిల్కనగరలోనే ఇది మూడోసారి కావడం గమనార్హం.. ఈ వరుస వివాదాలకు కారణం ఎన్నికలు సమిపించడమేనా....?**

**వరుస వివాదాలు సృష్టిస్తున్న సూత్రదారి ఎవరు....? సూత్రదారి వెనుక కార్పొరేటర్ భర్త హస్తం...?**





ఉప్పల్/ చిల్కనగర్,డిసెంబర్ 21 (నవతరం): జిహెచ్ఎంసి పరిదిలో ఉప్పల్ నియోజకవర్గం లోని చిల్కనగర్ 7వ డివిజన్ లో ప్రోటోకాల్ వివాదం రాజుకుంది. అధికార ఎమ్మెల్యే కు సమాచారం ఇవ్వకుండ అధికార కార్యక్రమం చేపట్టిన ఘటన చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్తే చిలకనగర్ డివిజన్ లో రెండు కోట్ల వ్యయం తో అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేయాల్సి ఉంది, ఈ కార్యక్రమానికి జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయ లక్ష్మి ముఖ్య అతిధిగా హాజరు అయ్యి అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేసారు. ఇక్కడే ప్రోటోకాల్ వివాదం రాజుకుంది నియోజకవర్గం ఏదైన సరే సంబంధిత ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వాలసిన బాధ్యత మున్సిపల్ అధికారుల మీద ఉంటుంది. కానీ కనీసం నగర మొదటి పౌరులు మేయర్ విజయ లక్ష్మి హాజరు అయ్యే కార్యక్రమానికి కనీస సమాచారం లేకపోవడం, ఇప్పటికి ఇదీ మూడోసారి కావడం అదికూడా చిల్కనగర్లో చోటు చేసుకోవడం గమనార్హం. ఇదే విషయం తెలుసుకున్న భారత రాష్ట్ర సమితి శ్రేణులు చిల్కనగర్ భారత రాష్ట్ర సమితి నాయకులు నిరసన తెలిపారు. మేయర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేసారు.

### ఎమ్మెల్యే వరుస వివాదాలకు కారణం సూత్రదారి పాత్ర కీలకం...

మలిదశ తెలంగాణ ఉద్యమం లో ముందు ఉండి పోరాడిన వ్యక్తి బేతి సుభాష్ రెడ్డి కి వరుసగా చేదు అనుభవాలు ఎదురు అవుతున్నాయి. ఈ వివాదాలు సృష్టిస్తున్న వ్యక్తి సూత్రదారి ఉప్పల్ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వ్యక్తి అని స్పష్టంగా కనిపిస్తుంది అని ప్రజలు గుస గుసలాడుతునారు. వివరాలోకి వెళ్తే అసెంబ్లీ ఎన్నికలు సమిపిస్తున్న వేల ఉప్పల్ ఎమ్మెల్యే టికెట్ కోసం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడ గట్టిగ పోటీ పద్తున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవలే బొంతు రామ్మోహన్ భార్య చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సంచలన వ్యాకలు చేయడం. ఇప్పుడు చిలకనగర్ కార్పొరేటర్ కనీసం ఆహ్వానించక పోవ డం ఇవ్వి అన్ని చూస్తుంటే వచ్చే ఎన్నికలో ఎమ్మెల్యే సుభాష్ రెడ్డికి చెక్ పెట్టాలని చూస్తున్నారని వినికిడి. అందుకే ఇలాంటి వివాదాలు తేరేలేపు తున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఏది ఏమైనా అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా అధికార కార్యక్రమాలు నిర్వహించడం ఏంటి అని తెరాస నాయకులు ప్రశ్నిస్తున్నారు.

### సూత్రదారి వెనుక కార్పొరేటర్ భర్త హస్తం.....?

ఉప్పల్ నియోజకవర్గం లో ఆ సూత్రదారి కొందరు అధికార పార్టీ కార్పొరేటర్లను తమ గుపిట్లో ఉంచుకున్నట్లు సమాచారం. ఎలాగైనా ఈ సారి ఉప్పల్ టికెట్ తనకే దక్కాలని చూస్తునట్టు అందుకే అందులో భాగమే ఈ వరుస వివాదాలు కావాలని సృష్టిస్తున్నారని భారత రాష్ట్ర సమితి నాయకుల గుసగుసలు వినపడ్తున్నాయి.

# అనారోగ్యంలో నెం.1 తెలంగాణ

**బంగారు తెలంగాణ దొరల ఇంటికే పరిమితమైంది.. లక్షల కోట్ల బడ్జెట్ లో బిసిల వాటా ఏది?**

**డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు, బహుజన్ సమాజ్ పార్టీ**






పెద్దపల్లి, డిసెంబర్ 21(నవతరం): బంగారు తెలంగాణ దొరల ఇంటికే పరిమితమైందని, పేదలకు మాత్రం కనీసం ఇళ్లు లేదు, ఇంటికి తలుపులు లేవని కడు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. 300ల రోజుల బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా 148వ రోజు యాత్ర ఈరోజు పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన పెద్దకల్వాల, ఉదయ్ నగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పేదల ఇళ్లను సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో బిసిలకు లక్ష కేటాయించాల్సి ఉండగా, కేవలం ఆరు వేల కోట్లు కేటాయించి మిగిలిన డబ్బంతా దొరలు లాక్కొని, కోటలు, సెక్రటేరియట్, ఇంద్రభవనాలు కడుతున్నారని విమర్శించారు. ఆత్మగౌరవ భవనాల పేరుతో బిసిలను మోసం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే బిసిల రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో నీటి కొరత కూడా ఎక్కువ ఉందని, వారానికి మూడు సార్లు మాత్రమే నీరు వస్తుందని పేర్కొన్నారు. పట్టణంలో కాలుష్యం ఎక్కువగా ఉందని తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మందులు కూడా ఉచితంగా ఇవ్వడం లేదని ఫలితంగా పిల్లలను చదువు మాన్పించి పనులకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానలో అనేక సమస్యలున్నాయన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 15 వేల రూపాయలు ఇస్తానని చెప్పి,కేవలం 7వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. హాస్పిటల్ లో,స్కానింగ్ సౌకర్యాలు లేవని, సాధారణ డెలివరీ కోసం ఒత్తిడి తెచ్చి పిల్లలను చంపుతున్నారని మండి పడ్డారు. రోగులకు మందులు ఇవ్వలేని ప్రభుత్వం దేశంలోనే నెం.1 అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పెద్దపల్లిలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులను కలిసి బహుజన రాజ్యంలో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రమాదానికి గురైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లారీ స్పేర్ పార్ట్స్ పై జిఎస్టి విధించడం అన్యాయమన్నారు. వెంటనే జిఎస్టి ఎత్తివేసి, లారీలకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిఆర్ఎస్ దోచుకోడానికే అధికారంలోకి వచ్చాయని, అందుకే దొరల పాలన అంతం చేసి పేదల రాజ్యం తెచ్చుకోవాలని, అందుకు ఏనుగు గుర్తుకు ఓటేసి బిఎస్పిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి హనుమయ్య, నియోజకవర్గ ఇంచార్జి దాసరి. ఉష, పెద్దపల్లి జిల్లా ఇంచార్జి శేఖర్, అడ్వైజర్ మల్లేష్, నరేష్, మహిళా కన్వీనర్ స్వప్నగౌడ్, జోనల్ కన్వీనర్ సరిత, నియోజకవర్గ కన్వీనర్ శారద, నియోజకవర్గ అధ్యక్షులు దుర్గయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డల ఆరోగ్యం కోసమే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు

కరీంనగర్, డిసెంబర్ 21(నవతరం): తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ను అందుబాటులోకి తేవడం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్ నుంచి వర్చువల్ మోడ్ లో రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్ పాల్గొన్నారు. వర్చువల్ ద్వారా ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్ - బాల్క సుమన్, ప్రభుత్వ విప్ భద్రాద్రి కొత్తగూడెం- పువ్వాడ అజయ్ కుమార్, ములుగు -సత్యవతి రాథోడ్, జయశంకర్ భూపాలపల్లి - ఎర్రబెల్లి దయాకర్ రావు, వికారాబాద్ -సబిత ఇంద్రారెడ్డి, నాగర్ కర్నూల్ - శ్రీనివాస్ గౌడ్, గద్వాల్ జిల్లా నుంచి మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గర్భిణుల వద్దకు వెళ్ళి కిట్స్ పంపిణీ చేశారు. ఇదే వేదికగా ఏఎన్ఎంలకు చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. బిడ్డ కడుపులో పడ్డప్పుడు న్యూట్రిషన్ కిట్, డెలివరీ అయిన తర్వాత కేసీఆర్ కిట్ అందించడం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ మరో అద్భుతమైన పథకానికి రూపకల్పన చేశారని, న్యూట్రిషన్ కిట్స్ గర్భిణులకు వరంగా మారనున్నాయన్నారు. తమవి న్యూట్రిషన్ పాలిటిక్స్.. వారివి పార్టిషన్ పాలిటిక్స్ అని విమర్శించారు. ప్రజా కోణంలో ఆలోచించి సీఎం కేసీఆర్ పథకాలు ప్రారంభిస్తారన్నారు. మాతా శిశు సంరక్షణకు పెద్ద పీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం మరో విప్లవాత్మకమైన పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభించిన కేసీఆర్ కిట్ సూపర్ హిట్ అయిందని, ఇదే స్ఫూర్తితో కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లకు రూపకల్పన చేశామన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనతో పుట్టిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, ఇదొక చారిత్రక ఘట్టమన్నారు. ఎక్కువగా ఎనీమియా (రక్త హీనత) ప్రభావంతో ఉన్న గర్భిణుల సంఖ్య 9 జిల్లాల్లో ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, ఇందులో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్ కర్నూల్, వికారాబాద్ ఉన్నాయన్నారు. 9 జిల్లాల్లో మొత్తం1.25 లక్షల మంది గర్భిణులకు రెండు ఏఎన్‌సీల్లో మొత్తంగా రెండున్నర లక్షల కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, దీని కోసం ప్రభుత్వం 50 కోట్లు ఖర్చు చేస్తున్నదని తెలిపారు. ప్రొటీన్స్, మినరల్స్, విటమిన్స్, ఐరన్ లను పోషకాహారం ద్వారా అందించి రక్త హీనత తగ్గించడం, హిమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రిషన్ కిట్ల లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఒక్కో కిట్ దాదాపు 2 వేలతో రూపొందించి, కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని, 13-27 వారాల మధ్య జరిగే రెండో ఏఎన్‌సీ చెకప్ సమయంలో ఒకసారి, 28-34 వారాల మధ్య చేసే మూడో ఏఎన్‌సీ చెకప్ సమయంలో రెండో సారి ఈ కిట్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. 9 జిల్లాల్లోని 231 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం ఈ పంపిణీ చేస్తుందన్నారు. ఈ న్యూట్రిషన్ కిట్లలో కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ 3 బాటిల్స్, 500 గ్రాముల నెయ్యి, ఆల్‌బెండజోల్ టాబ్లెట్, ఒకక్ కప్పు, ఒక ప్లాస్టిక్ బాస్కెట్ ఉంటాయన్నారు. రక్త హీనత గర్భిణుల పాలిట శాపంగా మారుతుందని, గర్భిణులకు ప్రసవాలు సంక్లిష్టంగా మారుతున్నాయని, ఎనీమియా నివారించడం వల్ల మాతృ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. మాతా శిశు సంరక్షణ కోసం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం మాతృ మరణాలు తగ్గించడంలో గొప్ప వృద్ధిని నమోదు చేసిందని చెప్పారు. ఈనెలలో విడుదలైన కేంద్ర ప్రభుత్వ శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వే ప్రకారం, రాష్ట్రంలో మాతృ మరణాల రేటు 2014లో 92 ఉండగా, ప్రస్తుతానికి 43కు తగ్గిందని, మాతృమరణాలు తగ్గించడంలో దేశంలోనే మనం మూడో స్థానంలో నిలిచామన్నారు. ఈ సంఖ్యను మరింత తగ్గించేందుకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ పథకాన్ని అమలు చేస్తున్నదని, ఇది గొప్ప మార్పునకు నాంది పలుకనున్నదన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలు అడగకుండానే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మంచి నీళ్ల కష్టాలు తీర్చారని, బీడీ చేసే మహిళలు, ఒంటరి



మహిళలకు ఆసరా పింఛన్లు ఇస్తున్నారని, ఆడపిల్లలు బాగా చదువుకోవాలని గురుకులాలు ప్రారంభించారని, 68 మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ప్రారంభించారని, పేదింటి ఆడ పిల్ల పెళ్లికి లక్షా 116 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం టి ఆర్ ఎస్ ప్రభుత్వమని, తల్లి ఆరోగ్యం కోసం ఇప్పుడు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాలు ఉన్నాయన్నారు. తెలంగాణ వచ్చాక ఆసుపత్రులు బాగయ్యాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 30 శాతం డెలివరీలు 66 శాతం పెరిగాయని, ఆస్పత్రుల్లో పడకలు 17 వేల నుండి 28 వేల పడకలు పెంచుకున్నామని, ఐసియు బెడ్స్ 200 నుంచి 600 వందలకు పేంచుకున్నామన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకుంటున్నామని, ఈ ఏడాది లోనే 12 ప్రారంభించుకున్నామన్నారు. ఎంఎంఆర్ మనం 2014 లో 92 ఉంటే 43 కు తగ్గించుకున్నామని, తగ్గింపులో దేశంలో రెండో స్థానంలో ఉన్నామని, మొన్ననే కేంద్రం రెండు అవార్డులు మనకు ఇచ్చిందన్నారు. నాలుగు ఏఎన్‌సీ చెకప్స్, కేసీఆర్ కిట్లు, అమ్మ ఒడి వాహనాలు, మాతా శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల వల్ల రాష్ట్రంలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. 2014లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 30శాతం ప్రసవాలు జరిగితే, ఇప్పుడు 66 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయని, 2014 నుంచి ఇప్పటి వరకు వచ్చిన మార్పు చూస్తే ఇనిస్టిట్యూషనల్ డెలివరీలు-91 నుంచి 99.7 శాతానికి పెరిగాయని,(దేశ సగటు 79), ఎంఎంఆర్ (మాతృమరణాల రేటు, లక్షకు)- 92 నుంచి 43 కు తగ్గిందని, (దేశ సగటు 97) ఐఎంఆర్(శిశు మరణాల రేటు, లక్షకు) -39 నుంచి 21 (దేశ సగటు 32) ఉందన్నారు. ప్రజల మధ్య ఎలా చిచ్చు పెట్టాలని కొందరు ఆలోచిస్తారని, మావి న్యూట్రిషన్ పాలిటిక్స్ అయితే వారివి పార్టిషన్ పాలిటిక్స్ అని ఎద్దేవా చేశారు.

### గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ లాంటి గొప్ప కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించినందుకు సంతోషంగా ఉందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా, మానవత్వంతో తల్లి, బిడ్డ కోసం మంచి కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈరోజు పుట్టబోయే బిడ్డలే, మన జాతి సంపద అని, వారు బాగుంటే దేశం బాగు పడుతుందన్నారు. కేసీఆర్ కిట్ ద్వారా 16 వస్తువులతో పాటు, తల్లి బిడ్డకు మనం 12 వేల రూపాయలు ఇస్తున్నామని తెలిపారు. ఆశ వర్కర్లు అమ్మగా కనిపిస్తున్నారని, గొప్పగా

### మంత్రి పర్యటన షెడ్యూల్ చేంజ్

మంత్రి హరీష్ రావు పర్యటనలో ఆకస్మికంగా షెడ్యూల్ చేంజ్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలకు 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ కు శంకుస్థాపన చేసి ఎంసిహెచ్ పనులను పరిశీలించాల్సి ఉండగా షెడ్యూల్ ను అప్పటికప్పుడు మార్చేశారు. రైతులు అడ్డుకుంటారన్న సమాచారంతో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి దేవునిపల్లి మీదుగా ఎంసిహెచ్ వరకు వెళ్లాల్సి ఉండగా నిజాంసాగర్ చౌరస్తా నుంచి రైల్వే కమాన్, రామారెడ్డి చౌరస్తా, గుమస్తా కాలనీ మీదుగా కలెక్టరేట్ వరకు మంత్రి కాన్వాయి బయలుదేరింది. 11 గంటలకు ప్రారంభించాల్సిన న్యూట్రిషన్ కిట్ కార్యక్రమాన్ని ముందుగానే ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి గుమస్తా కాలనీ, టెక్రియాల్ బైపాస్, కొత్త బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, దేవునిపల్లి మీదుగా ఎంసిహెచ్ వరకు వెళ్లి అక్కడ క్రిటికల్ కేర్ కేంద్రానికి శంకుస్థాపన చేసి ఎంసిహెచ్ పనులను పరిశీలించారు.




పని చేస్తున్నారని కొనియాడారు. ఆరోగ్య శాఖలో ఇంత పని ఉంటుందని మంత్రి హరీశ్ రావు చూపిస్తున్నారని ప్రశంసించారు. సీఎం కేసీఆర్ ఆరోగ్య తెలంగాణ లక్ష్యం వైపు రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తున్నారన్నారు.

**- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

### తల్లులు క్షేమంగా ఉంటే సమాజం క్షేమంగా ఉంటుంది

తల్లులు క్షేమంగా ఉంటే సమాజం క్షేమంగా ఉంటుందని శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తల్లులు ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకున్నారు కాబట్టి నాడు సాధారణ ప్రసవాలు జరిగాయన్నారు. తల్లులు క్షేమంగా ఉంటే సమాజం క్షేమంగా ఉంటుందని, అందుకే సీఎం కేసీఆర్, కేసీఆర్ కిట్స్, న్యూట్రిషన్ కిట్స్ ప్రారంభించారని చెప్పారు. ఇప్పటివరకు 12 లక్షల మంది కిట్స్ అందుకున్నారన్నారు. ఈ దేశానికి కావాల్సింది రాజకీయ నాయకుడు కాదని, ప్రజా నాయకుడన్నారు. ప్రభుత్వాలు పడగొట్టే ప్రయత్నానికి ఉన్నవారు ఎందుకని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, జెడ్పి చైర్ పర్సన్ శోభ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్, జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే, కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందూ ప్రియ, అధికారులు పాల్గొన్నారు.

**-స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి**

### క్రిటికల్ కేర్ నిర్మాణానికి శంకుస్థాపన.. ఎంసిహెచ్ పరిశీలన

దేవునిపల్లి శివారులో ఎంసిహెచ్ ఆస్పత్రి పక్కనే 23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ కు మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం పక్కనే నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు ఆస్పత్రి పనులను పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణ పనులను అధికారులు, కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. మార్చి లోపు ఆస్పత్రి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మెడికల్ కళాశాల మంజూరైనందున ఆస్పత్రి పనులు త్వరగా పూర్తి చేస్తే మెడికల్ కళాశాల విద్యార్థులకు వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి క్లాసులు ప్రారంభించుకోవచ్చని సూత్రప్రాయంగా నిర్ణయించారు.

### మంత్రి పర్యటన.. రైతుల అరెస్టులు

కామారెడ్డి జిల్లా కేంద్రానికి మంత్రి హరీష్ రావు పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజులుగా కామారెడ్డి మాస్టర్ ప్లాన్ తో తాము భూములు కోల్పోతున్నామని, అధికార పార్టీ నేతలు కావాలని భూములను లాక్కుంటున్నారని, ఇందులో ఎమ్మెల్యేల హస్తం ఉందంటూ ఆందోళన చేస్తున్నారు. బుధవారం మంత్రి కామారెడ్డికి వస్తున్నారని మంత్రిని కలిసి తమ సమస్య చెప్పుకుందామని భావించిన రైతులకు పోలీసులు ఝలక్ ఇచ్చారు. ఎక్కడికక్కడ రైతులను ముందస్తుగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా అక్కడక్కడ రైతులు చేరుకుని మంత్రిని కలవడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంత్రి ఉన్నారని తెలుసుకుని ముగ్గురు రైతులు కలెక్టరేట్ కు చేరుకోగా వారిని పోలీసులు గేటు వద్దనే అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద మంత్రి భోజనం చేస్తున్న సమయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామని చెప్పినా వినకుండా పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కార్యకర్తలు, నాయకులలో కలిసిపోయి ఉన్న రైతులను పోలీసులు డేగకన్నుతో పరిశీలించారు. ఎక్కడెక్కడ రైతులు ఉన్నారో క్షుణ్ణంగా పరిశీలిస్తూ బయటకు పంపించేశారు. అనుమానం వచ్చిన అధికార పార్టీకి చెందిన సర్పంచులు, ఇతర నాయకులను సైతం బయటకు పంపించేశారు.

# ఎమ్మెల్సీ టికెట్ అమ్ముకున్న వ్యక్తి నాపై ఆరోపణలు చేయడమా..?

## బీజేపీ నేత వెంకట రమణారెడ్డిపై షబ్బీర్ అలీ ఫైర్

## రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వెల్లడి



కామారెడ్డి, డిసెంబర్ 21(నవతరం): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ టికెట్ ఇస్తే అమ్ముకొని సింగల్ గా వెళ్లి నామినేషన్ విత్ డ్రా చేసుకున్న వ్యక్తి మాస్టర్ ప్లాన్ విషయంలో నాపై ఆరోపణలు చేయడమా అని బీజేపీ నేత కాటిపల్లి వెంకట రమణారెడ్డిపై మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఫైర్ అయ్యారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలపై బుధవారం తన నివాసంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత కాటిపల్లి వెంకట రమణారెడ్డిపై షబ్బీర్ అలీ ఆసక్తికర కామెంట్లు చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ కు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ లో రైతులతో సహా నేను కూడా ఒక బాధితున్నేనన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ వస్తున్న ఏరియాలో తనకు 13.14 ఎకరాల భూమి ఉన్న మాట వాస్తవమేనన్నారు. 15 ఏళ్ల క్రితమే ఆ భూమి కొనుగోలు చేసి ఐదేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపారు. ఆ భూమిని అమ్మలేదని స్పష్టం చేశారు. అమ్మకానికి ప్రపోజల్ వచ్చినా అమ్మలేదని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డుకు తన భూమి చాలా దూరం ఉంటుందన్న ఆయన మాస్టర్ ప్లాన్ విషయంలో ముందుగా స్పందించి కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ ద్వార తాను మాత్రమేనని గుర్తుచేశారు. ఇబ్రహీంపట్నంలో ఇలాగే భూమి సేకరించి భూములు చదును చేసి ఒక్కొక్క రైతుకు 5 లక్షలిచ్చి 12 కోట్లకు అమ్ముకున్నారని, కోకాపేటలో ఎకరం 60 కోట్లకు అమ్ముకున్నారని తెలిపారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ లో ఇండస్ట్రియల్ జోన్, గ్రీన్ జోన్ లో భూములు పోతున్న నిర్వాసితులు తనను కలిసి వినతి పత్రం అందించారని, దీనిపై అరవింద్ కుమార్ ఐఏఎస్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి ఆ మాస్టర్ ప్లాన్ అమలు కాకుండా చూడాలని కోరడం జరిగిందన్నారు. తన పర్సనల్ సెక్రెటరీ ద్వారా వినతిపత్రం కూడా పంపించానని, దాంతో అరవింద్ కుమార్ స్పందిస్తూ రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న మాస్టర్ ప్లాన్ ను తప్పకుండా ఆపేస్తామని తెలిపారన్నారు. గురువారం సాయంత్రం లోపు మాస్టర్ ప్లాన్ విషయంలో స్పష్టత వస్తుందన్నారు. బీజేపీ నేత వెంకట రమణారెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ఆయనది కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏ అని, కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వ్యక్తి ఆయన అని గుర్తు చేశారు. రమణారెడ్డికి తన చేతుల మీదుగా నాలుగు సార్లు బి ఫార్మ్ ఇచ్చానని, ఎమ్మెల్సీగా పోటీ చేస్తా అంటే పార్టీ అధిష్టానం బి ఫారం ఇవ్వకుంటే అధిష్టానాన్ని ఒప్పించి ఎమ్మెల్సీగా బి ఫార్మ్ ఇప్పించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మీటింగులో ప్రాణం పోయినా తప్పు చేయనని చెప్పి నామినేషన్ రోజు సింగిల్ గా వెళ్లి విత్ డ్రా చేసుకున్నాడని వ్యాఖ్యానించారు. నమ్మకంతో పార్టీ టికెట్ ఇస్తే అమ్ముడుపోయాడని ఆరోపించారు. కోట్లకు అమ్ముడు పోయాడని మీడియాలో కథనాలు కూడా వచ్చాయన్నారు. ఎందుకు విత్ డ్రా అయ్యావని అడిగితే ఈటల రాజేందర్ ఫోన్ తో కేసీఆర్ ఫోన్ చేసి బెదిరించారని చెప్పాడన్నారు. షబ్బీర్ ఆలీకి 2 కోట్లు ఇచ్చి ఎమ్మెల్సీ టికెట్ తెచ్చుకున్నా అని ప్రచారం చేశారని, మీడియా సమావేశంలో జర్నలిస్టులు ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందని అడిగితే మధ్యలోనే వెళ్ళిపోయాడన్నారు. మళ్ళీ కొన్ని రోజులకు వచ్చి కాంగ్రెస్ లో చేరతానంటే క్యారెక్టర్ బాగాలేదని నేను చేర్చుకోనని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఈ రోజు తనకు 100 ఎకరాలు ఉందని బద్నాం చేస్తున్నారన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎవరి వద్ద ఒక్క రూపాయి ఆశించలేదన్నారు. మొన్నటిదాకా మూడు నెలల పాటు అబ్దుల్లా నగర్ శివారుపై మాట్లాడాడని, ఇప్పుడు అబ్దుల్లా నగర్ ఏమైంది..? సమస్య పరిష్కారం అయిందా..? అక్కడి రైతులకు న్యాయం జరిగిందా..?లేక నీకు న్యాయం జరిగిందా అని రమణారెడ్డిని ప్రశ్నించారు. అబ్దుల్లా నగర్ భూములపై ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్ లో తన ఇల్లు కూడా పోతుందని, గతంలో 40 ఫీట్లు ఉన్న రోడ్డు ఇప్పుడు 80 ఫీట్లు చేశారు.. అందులో నా ఇల్లు 20 ఫీట్లు పోతుందన్నారు. అయినా రోడ్డు వెడల్పు అయితే మంచిదే కదా అన్నారు. అధికారంలో ఉంటే బురద జల్లే ప్రయత్నం చేస్తే ఒక అర్థం ఉంటుందని, 15 ఏళ్లుగా నేను అధికారంలో లేనని, తనకు మాస్టర్ ప్లాన్ కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటానని, మాస్టర్ ప్లాన్ లో ఇండస్ట్రియల్ జోన్ పట్టణానికి దూరంగా చేయాలని కోరానన్నారు. 100 ఫీట్ల రోడ్డు కాకుండా 60 ఫీట్లు పెట్టాలని సూచించడం జరిగిందన్నారు. తనపై అనవసర దుష్ప్రచారం చేస్తున్నారని, రాజకీయాల్లో ఆరోగ్యకరమైన విమర్శలు ఉండాలి.. ఇలాంటివి కాదని హితవు పలికారు. ఇన్నేళ్లు రమణారెడ్డి తండ్రి రాజిరెడ్డి తన గురువు అనే కారణంతో మాట్లాడలేదని, ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మాట్లాడాల్సి వస్తోందని, ప్రజలు గమనించాలని కోరారు.

## చంద్రబాబు నాయుడుకి స్వాగతం పలికిన అబ్దుల్లాపూర్ మెట్ నాయకులు



అబ్దుల్లాపూర్, డిసెంబర్ 21(నవతరం): చలో ఖమ్మం భారీ బహిరంగ సభ తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కాశాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరుగుతున్న భారీ సభకు ఖమ్మం వెళుతున్న తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద ఇబ్రహీంపట్నం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చింతకింద చక్రపాణి ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్ టీడీపీ మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి బాలబ్రహ్మ చారి అధ్యక్షతన భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ స్వాగతంలో భోనగిరి పార్లమెంట్ ఇంచార్జి కుందారం కృష్ణమాచారి, రాష్ట్ర కార్యదర్శి జలమోని రవీందర్, రాష్ట్ర తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శి మంకు ఇందిర, భోనగిరి పార్లమెంట్ తెలుగు యువత జక్క కరుణాకర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షుడు జక్కా రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ అధ్యక్షుడు రావుల వీరేశం, నక్కా మహేందర్, అంబర్ పేట్ మున్సిపల్ అధ్యక్షుడు గిరీశం, రాజిరెడ్డి, అది బట్ల తెలుగు యువత మెట్టు దామోదర్ రెడ్డి, తాటిపల్లి వెంకటేష్, రమేష్, బొడుసు రమేష్, హరీష్, జక్క రంగారెడ్డి, మేడిపల్లి జంగయ్య, ప్రభాకర్, అశోక్, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఇబ్రహీం, ఎడ్ల రాములు, వీరచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: సీడీపీఓ హైమావతి



పెద్దవంగర, డిసెంబర్ 21(నవతరం): పిల్లలు ఎదుగుదల, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీఓ హైమావతి, సర్పంచ్ దుంపల జమున సమ్మయ్య అన్నారు. బుధవారం ఉప్పరగూడెం గ్రామంలోని రెండవ అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె సూపర్వైజర్ కవితతో కలిసి సందర్శించారు. పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి, తీవ్ర లోప పోషణ గల చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆకలి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. వయసుకు తగిన ఎత్తు, బరువు లేని పిల్లలను గుర్తించి, పోహకాహార లోపాన్ని నివారించాలన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోప పోషణ వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తాయని, దీని నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రుక్సానా బేగం, అంగన్వాడి టీచర్లు రమా, రేణుక పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయం

### జిల్లా డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి



పెద్దవంగర, డిసెంబర్ 21(నవతరం): కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం ఖాయమని, అందుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జిల్లా డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి అన్నారు. ఇటీవల డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పార్టీకి బలమైన కేడర్ ఉందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం తథ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ రాజ్యమే అన్నారు. రేవంత్ రెడ్డి పాదయాత్రకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు పూర్ణచందర్, దాసరి శ్రీనివాస్, సీతారాం నాయక్, జగ్గా నాయక్, వెంకన్న, సతీష్, సమ్మయ్య, వేణు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలి

## ఏఐపీకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న



పెద్దవంగర, డిసెంబర్ 21(నవతరం) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బుధవారం ఆర్ఐ భూక్య లష్కర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. పంటలకు సరైన గితుబాటు ధర అందించేదుకుగాను ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని దానికోసం రైతాంగం బలమైన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అసలే పెట్టిన పెట్టుబడి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఎరువులపై సబ్సిడీ ఎత్తివేయడం మరింత భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఆలోచనలు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసేందుకు రైతులను అన్ని విధాల ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటికే వ్యవసాయరంగం సంక్షోభంలో నెట్టివేయబడిందని, దేశంలో ఆర్థిక సంక్షోభం పెరిగిపోయిందన్నారు. రైతన్న వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ రైతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 60 సంవత్సరాల వయసు దాటిన రైతులకు నెలకు 5 వేల రూపాయల పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ జిల్లా నాయకుడు చింత నవీన్, అఖిల భారత రైతు రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు గుగులోతు ఫుల్ సింగ్, మండల నాయకులు ఈదురు బిక్షం, ఏదురి అప్పయ్య, వెంకన్న, గద్దల రామకృష్ణ పాల్గొన్నారు.

WANTED REPORTERS
నవతరం తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9100357326
navataramtelugudaily@gmail.com

# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య



పెద్దవంగర, డిసెంబర్ 21(నవతరం): సీఎం కేసీఆర్ తోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మండలంలోని పలు నూతన జీపీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటుగా, తండాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది అన్నారు. కాగా మండలంలోని పోచారం, చిన్నవంగర, కాన్వాయిగూడెం, గంట్లకుంట, రెడ్డికుంట తండా, బీసీ తండా, మోత్య తండా, పడమటి తండా గ్రామాల్లో నూతన జీపీ భవన నిర్మాణానికి 20 లక్షల చొప్పున 1.60 కోట్ల నిధులు విడుదల అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేతిరెడ్డి సోమనరసింహ రెడ్డి, పాలకుర్తి యాదగిరి రావు, కనుకుంట్ల వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్ కుమార్, సలీదండి సుధాకర్, సర్పంచులు చింతల భాస్కర్, ధరావత్ రాజేందర్, ధరావత్ భీమా నాయక్, నూనవత్ బాలు, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు బోనగిరి లింగమూర్తి, రెడ్డబోయిన గంగాధర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిలుక బిక్షపతి, ఉప్పలయ్య పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీని కలిసిన ప్రజలు

మేడ్చల్, డిసెంబర్ 21(నవతరం): మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని జిల్లా పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన ప్రజలు శంభీపూర్ లోని కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు ను వెంటనే సస్పెండ్ చేయాలి: విహెచ్పి




కొత్తగూడెం, డిసెంబర్ 21(నవతరం): ఏసుక్రీస్తు వల్లనే కరోనా మహమ్మారి అంతమైందని.. వైద్యులు మందులు.. ఇతర మెడిసిన్ వల్ల కరోనా పంతం కాలేదని.. కేవలం ఏసుక్రీస్తు వల్లనే కరోనా మహమ్మారి తగ్గుముఖం పట్టిందని తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడడాన్ని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ శాఖ తీవ్రంగా ఖండిస్తోంది. ఏసుక్రీస్తు వల్లనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని ఆయన మాట్లాడటం ముమ్మాటికి తగదని విశ్వహిందూ పరిషత్ హెచ్చరిస్తోంది. ఒక ఉన్నతమైనటువంటి స్థాయిలో ఉన్న వ్యక్తి మతాలను ప్రేరేపించే విధంగా.. కిందిస్థాయి ఉద్యోగులను ప్రభావితం చేసే విధంగా.. హిందువులను కించపరిచే స్థాయిలో మాట్లాడటం తగదని తీవ్రంగా హెచ్చరిస్తోంది. శ్రీనివాసరావు మాటలను తప్పుపడుతూ బుధవారం సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సురేందర్ రెడ్డి, శ్రీ పండరీనాథ్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. క్రిస్మస్ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. హిందుత్వాన్ని, వైద్య విధానాన్ని, సైన్స్ ను, శాస్త్రవేత్తలను కించపరిచే స్థాయిలో మాట్లాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. బుధవారం కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ సెలబ్రేషన్ లో శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవజాతికి ఏసుక్రీస్తు మాత్రమే దైవమని.. మిగతా దేవుళ్ళందరూ గ్రాఫిక్స్ అని కించపరిచే మాటలు మాట్లాడటాన్ని ప్రతి హిందువు తీవ్రంగా తప్పుపడుతున్నాడన్నారు. యేసుక్రీస్తు వల్లనే భారతదేశం అభివృద్ధి సాధిస్తుందని మాట్లాడటంలో అసలు అర్థం ఉందా అని నిలదీశారు. ఏసుక్రీస్తుకు సంబంధం ఏమిటని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లక్షల మంది వైద్యులు.. కోట్ల మంది వైద్య సిబ్బంది.. శాస్త్రవేత్తలు అహోరాత్రులు శ్రమిస్తే గాని కరోనా అదుపులోకి రాలేదన్న విషయాన్ని శ్రీనివాస్ రావు విస్మరించడం ఆయన బుద్ధిలేనితనానికి నిదర్శనం అన్నారు. తమ డిపార్ట్మెంట్లోని ఉద్యోగులందరినీ హిందూ క్రైస్తవులుగా విభజించి, క్రైస్తవులకు మేలు కలిగే విధంగా ఆయన మాట్లాడారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ క్షమించరాని నేరమని తప్పుపట్టారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నేతలు డిమాండ్ చేశారు. ఒక ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యాఖ్యలు చేయడం నేరం కాదా? అని వారు ప్రశ్నించారు. ఆయనపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే హైకోర్టులో ఆయనపై కేసు వేసి సస్పెండ్ చేసేదాకా పోరాడుతామని హెచ్చరించారు. అణువణువునా స్వార్థం ఉన్న శ్రీనివాసరావు గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కాళ్లు మొక్కి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరువు మర్యాదలు గంగలో కలిపారన్నారు. ఇదే విషయమై మీడియా వాళ్ళు అడిగితే " కెసిఆర్ తన తండ్రి లాంటివాడని.. వందసార్లు కాళ్లు మొక్కుతా" అంటూ బానిస సమాధానం చెప్పారు. "గౌరవ మర్యాదలు చూపించడం వేరు.. విధి నిర్వహణలో వ్యవహరించాల్సిన తీరు వేరు" అనే విషయాన్ని శ్రీనివాసరావు తో పాటు కాళ్లు మొక్కి ఉద్యోగులు గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. అంతేకాకుండా గతంలో మూఢనమ్మకాల పేరుతో పూజలు నిర్వహించి వైద్య విధానాన్ని అభాసుపాలు చేసే విధంగా వ్యవహరించారన్నారు. వెంటనే శ్రీనివాస్ రావు పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హెచ్చరించారు.